క్లుప్తంగా

అరెస్టులు అప్రజాస్వామికం



భూత్పూర్: ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ఆదేశంతో చలో సూర్యపేట కార్యక్రమానికి వెళ్తున్న తమను ముందస్తుగా అరెస్టు చేయడం అప్రజాస్వామికం అని బీఎస్పీ మండల అధ్యక్షుడు బాల్‌రాజ్ బుధవారం ఆరోపించారు. భూత్పూర్ స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. ఉపాధ్యక్షుడు నర్సింహులు తదితరులు ఉన్నారు. తరువాత వీరిని సొంత పూచీకత్తుపై పోలీసులు విడుదల చేశారు.
దేవరకద్ర: మండలానికి చెందిన బీఎస్పీ నాయకులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మహేందర్ యాదవ్, మండల కమిటీ అధ్యక్షుడు సత్యసాగర్ తదితరులు ఉన్నారు.

వంటగ్యాస్ ధర తగ్గించడం హర్షణీయం

జడ్చర్ల: వంటగ్యాస్ సిలిండర్ ధరను ప్రధాన మంత్రి మోదీ తగ్గించడం హర్షణీయమని నియోజకవర్గ బీజేపీ నాయకులు మధుసూదన్ యాదవ్ తదితరులు తెలిపారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కౌన్సిలర్ రాజు, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.
పాలమూరు: మోదీ చిత్రపటానికి బుధవారం బీజేపీ మహిళ మోర్చా ఆధ్వర్యంలో పాలభిషేకం చేశారు. నాయకులు పద్మవేణి, నిరంజనమ్మ, లక్ష్మీదేవి, బాలీశ్వరీ పాల్గొన్నారు.

‘చలో ఇందిరాపార్క్’ విజయవంతం చేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: హైదారాబాద్‌లో సెప్టెంబర్ 1న నిర్వహించే చలో ఇందిరాపార్క్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో జిల్లా యూటీఎఫ్ సంఘం సమావేశం బుధవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, రవికుమార్ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పీఆర్సీ ఇవ్వాలని, 317 లో స్థానను కోల్పోయిన వారికి న్యాయం చేయాలని తదితర డిమండ్లతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్ర మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహయ్య మాట్లాడుతూ చేవెళ్ల సభలో ప్రకటించిన డిక్లరేషన్‌లో ఎస్సీ వర్గీకరణ అంశం పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఓటుబ్యాంకు రాజకీయాల కోసం తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని లేవనెత్తడం సరికాదన్నారు. అన్నదమ్ముల లాంటి మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, నాయకులు రాఘవేందర్, వెంకటేశం, శివకుమార్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి

మహబూబ్‌నగర్ క్రైం: కొత్త వ్యక్తులకు ఇళ్లను అద్దెకు ఇచ్చే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలని, కాలనీల్లో ఎవరైనా అనుమానస్పదంగా కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు అన్నారు. రాజీవ్ గృహకల్పలో బుధవారం రాత్రి కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంలో భాగంగా ఇళ్లను తనిఖీ చేయడంతో పాటు స్థానికంగా నివాసం ఉండే వారి వివరాలు పరిశీలించారు. దీంతో పాటు సరైన పత్రాలు లేని 15ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలు, రెండు కార్లను సీజ్ చేశారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని, సెల్‌ఫోన్‌లకు ఏదైనా ఆఫర్ పేరుతో మెసేజ్‌లు వస్తే క్లిక్ చేయరాదన్నారు. కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. సెకండ్ హ్యాండ్‌లో వాహనాలు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు.

భర్త వేధింపులు తట్టుకోలేక భార్య బలవన్మరణం

కోయిల్‌కొండ: భర్త వేధింపులు తట్టుకోలేక భార్య బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని పారుపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వడ్డెరవితో 13ఏళ్ల క్రితం వడ్డె లక్ష్మికి వివాహమైంది. 8ఏళ్లుగా భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోగా ఎందుకు ఇలా చేస్తున్నావని భార్య నిలదీసేది. దీంతో శారీరకంగా వేధిచేవాడని, మంగళవారం రాత్రి లక్ష్మిని కొట్టడంతో ఇంట్లో పంచెతో ఉరేసుకుంది. మృతురాలి అన్న వడ్డెగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ తెలిపారు.

ఆర్థికసాయం

భూత్పూర్: అమిస్తాపూర్‌లోకి చెందిన బాలకృష్ణయ్య మృతిచెందడంతో ముడా డైరెక్టర్ సాయిలు బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. కో ఆప్షన్ సభ్యుడు ఎండీ అజీజ్, నాయకులు ఉన్నారు.

పాఠశాలల్లో రాఖీ వేడుకలు



భూత్పూర్‌లో రాఖీ అక్షర రూపంలో కూర్చున్న విద్యార్థులు



బండ్రపల్లి పాఠశాలలో రాఖీ వేడుకలు

స్టేషన్ మహబూబ్‌నగర్: స్థానిక అశోక్‌టాకీస్ చౌరస్తా సమీపంలోని భక్త మార్కండేయ దేవాలయంలో బుధవారం నూలు (రాఖీ) పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం ట్రస్ట్ చైర్మన్ రుమాండ్ల పద్మ, లక్ష్మీనారాయణ, అనిల్‌కుమార్, సారంగి వినయ్‌కుమార్, శ్రీరాంకుమార్ పాల్గొన్నారు.
చిన్నచింతకుంట: బండ్రపల్లి, అప్పంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు బుధవారం రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాఖీలు కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
నవాబుపేట: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులకు బుధవారం చాణుక్యా పాఠశాల విద్యార్థులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, ఎంపీడీఓ శ్రీలత ఉన్నారు. మండల కేంద్రంలో రాఖీల గిరాకీ జోరుగా సాగింది.
జడ్చర్ల టౌన్: మండలంలోని స్వామినారాయణ అంతర్జాతీయ గురుకుల పాఠశాల, మిడ్‌లాండ్ పాఠశాలల్లో బుధవారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాఖీ తయారీ పోటీలు నిర్వహించారు. మున్సిపాలిటి పరిధిలో పండుగ సందర్భంగా రాఖీలవిక్రయాలు జోరుగా సాగాయి.
దేవరకద్ర: పురాతన సంప్రదాయ బద్ధంగా రుద్రాక్ష రాఖీలను అందరు కట్టుకోవాలని కోరుతూ కైలాస నాథ ధ్యాన ఆశ్రమం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని బస్వాయపల్లి గ్రామంలో రుద్రాక్ష రాఖీలను పంపిణీ చేశారు. ఆశ్రమ నిర్వాహకులు మఠం జగదీశ్వర్, పారిజాత గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులందరికి అందజేసి రుద్రాక్ష రాఖీలను కట్టించారు. రుద్రాక్ష రాఖీలు కావలసిన వారు శివశక్తి నగర్ మహబూబ్‌నగర్‌లోని కై లాసనాథ ఆశ్రమంలో తీసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
భూత్పూర్: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో బుధవారం రక్షా బంధన్ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు.



జడ్చర్లలో ..



బస్వాయపల్లిలో ..



నవాబుపేటలో రాఖీల కొనుగోలు

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

హన్వాడ: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ వల్ల అయ్యేది లేదు, పొయ్యేది లేదని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో ఉన్న 14 నియోజకవర్గాల్లో తిరిగి తమ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇబ్రహీంబాద్ ఎంపీటీసీ, బీజేపీ మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు కొత్త లక్ష్మమ్మ, మండల కోశాధికారి అంజిల్‌రెడ్డి హైదరాబాద్‌లో మంత్రి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పిపార్టీలోకి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. కాగా అభివృద్ధిని చూసే పార్టీలో చేరుతున్నట్లు ఎంపీటీసీ లక్ష్మమ్మ, అంజిల్‌రెడ్డి పేర్కొన్నారు. త్వరలో బీజేపీకి చెందిన ముఖ్యనాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతారని వెల్లడించారు. ఎంపీపీ బాల్‌రాజు, జెడ్పీటీసీ విజయనిర్మల, సర్పంచ్ వసంత, మండల కోఆప్షన్ మన్నన్ పాల్గొన్నారు.



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కుకి రాఖీ కడుతున్న జెడ్పీటీసీ విజయనిర్మల

మంత్రికి రాఖీ కట్టిన జెడ్పీటీసీలు

హన్వాడ, మహబూబ్‌నగర్ జెడ్పీటీసీలు విజయనిర్మల, వెంకటేశ్వరమ్మ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు రాఖీలు కట్టి పండగ శుభాకాంక్షలు తెలిపా రు. మంత్రి మాట్లాడుతూ అక్కాచెల్లెమ్మలు తనప ట్ల చూపుతున్న ప్రేమాభిమానాలకు ధన్యవాదాలన్నారు.

సచార్ కమిటీ సిఫార్సులను అమలుచేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: దేశంలో మైనార్టీల విద్య, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వెనుకబాటుతనాన్ని తొలగించేందుకు సచార్ కమిటీ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రాజకీయంలో ప్రాతినిధ్యం మెరుగుపడాలంటే ఇతరులకు సీట్లు రిజర్వు చేసే విధంగా మైనార్టీలకు కూడా రిజర్వు చేయాలని కోరారు.

నేటి నుంచి ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం



మహమ్మదాబాద్: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటైన జూనియర్ కళాశాలలో గురువారం నుంచి అడ్మిషన్లు ప్రారంభమవుతాయని ప్రిన్సిపాల్ రవీందర్ తెలిపారు. కళాశాలలో ఎలాంటి ఫీజు లేకుండా ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో విద్యార్థులు చేరవచ్చన్నారు. ఈ సందర్భంగా ఆయనను మహమ్మదాబాద్ ఉన్నత పాఠశాల షష్ట్యాబ్ది కమిటీ సన్మానించారు. గ్రామస్తులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శాంతీబాయి, విజయానంద్‌రెడ్డి, ముంతాజ్‌హుస్సేన్, బాల్‌రాజ్, అనంతయ్య, హశ్రీచ్‌ఎం వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలి



మేనేజర్‌తో మాట్లాడుతున్న సర్పంచ్, ఎంపీటీసీ

అడ్డాకుల: మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న సర్వీస్ రోడ్ల వద్ద నిర్వాహకులు ఏర్పాటు చేసిన వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ మంజుల విజ్ఞప్తి చేశారు. శాఖాపూర్ టోల్‌ప్లాజాలో బుధవారం ప్రాజెక్టు మేనేజర్ దీపా మాడైయాను సర్పంచ్‌తో పాటు ఎంపీటీసీ రంగన్నగౌడ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ భీమన్నయాదవ్‌లు కలిశారు. వీధి లైట్లు వెలగకపోవడంతో రాత్రివేళ ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. విద్యుత్‌శాఖకు సంబంధించిన డెవలప్‌మెంట్ చార్జీల అంశంలో ఉన్న వివాదం మూలంగా వీధిలైట్లకు సంబంధిత అధికారులు సరఫరాను నిలిపి వేసినట్లు మేనేజర్ గ్రామస్తులకు వివరించారు. సాధ్యమైనంత త్వరగా వివాదం ముగించి వీధిలైట్లు వెలిగించే విధంగా చూస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా ఆపరేషన్స్, మెంటినెన్స్ మేనేజర్లు సంతోష్‌కుమార్, బాలమురుగన్, ఇంజినీయర్ సుభాష్, రూట్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ రాకేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితాలో తప్పులుంటే సరిచేస్తాం



మాట్లాడుతున్న ఈఆర్‌ఓ నటరాజ్

దేవరకద్ర: ఓటరు జాబితాలో ఏమైన తప్పులు ఉంటే సవరిస్తామని, రాజకీయ పార్టీలన్నీ సహకరించాలని దేవరకద్ర నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నటరాజ్ తెలిపారు. బుధవారం సాయంత్రం దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు నమోదు జరుగుతున్నదని, కొత్త ఓటర్లను చేర్చడానికి ఆయా గ్రామాలకు బీఎల్‌ఓలు వస్తారని వారికి సహకరించి నమోదు చేయించాలని కోరారు. అడ్రస్ మార్పులు, ఇంకా ఇతర తప్పులు ఉంటే బీఎల్‌ఓలకు సంబంధిత ఫామ్‌లను నింపి ఇవ్వాలని అన్నింటిని పరిష్కరిస్తామని తెలిపారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్నాయని ఎన్నికల కమిషన్ జారీ చేసే నిబంధనల ప్రకారం పార్టీల నాయకులు నడుచుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించరాదని పేర్కొన్నారు. సమావేశంలో తహశీల్దార్ శ్రీనివాస్, డీటీలు ఆంజనేయులు, రహమాన్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.
నవాబుపేట: ఓటర్ల జాబితాపై బిఎల్‌ఓలు నిర్లక్ష్యం చేయకుండ విధులు నిర్వహించాలని తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, ఎంపీడీఓ శ్రీలత సూచించారు. బుధవారం మండల కేంద్రంలో అవగాహన నిర్వహించారు.

నవాబుపేట పాఠశాలలో వైద్య శిబిరం




నవాబుపేట: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో బుధవారం హోమియోపతి ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల, బాలికలకు ప్రత్యేకంగా ఎదుగుదలకు సంబంధించిన మందులు అందించారు. ప్రతి 30 రోజులకు ఒకసారి ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు వివరించారు. సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, హోమియోపతి డాక్టర్ వనజ, సర్పంచ్ గోపాల్‌గౌడ్, నర్సింహులు, గిరి, రవి తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల జారీకి ఓటరుకార్డు తప్పనిసరి!

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కొన్ని ధ్రువపత్రాల జారీకి ఇటీవల రెవెన్యూ సిబ్బంది ఓటరు గుర్తింపు కార్డును తప్పనిసరి చేశారు. ధ్రువపత్రాల కోసం మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి వెళితే అక్కడ గిర్దావర్ తప్పని సరిగా ఓటరు కార్డు తీసుకు రావాలని అడుగుతున్నారు. ఆధార్ ఉన్నా ఓటరు కార్డు తేవాల్సిందేనని చెబుతున్నారు. దీంతో దరఖాస్తు దారులు ఇబ్బందులకు గురవుతున్నారు. విషయమై తహసీల్దార్ బ్రహ్మంగౌడ్‌ను బుధవారం సంప్రదించగా ధ్రువపత్రాల జారీకి ఓటరు గుర్తింపు కార్డు అవసరం లేదన్నారు. ఆధార్‌కార్డుతో పాటు ఇతర పత్రాలు ఉంటే సరిపోతుందన్నారు. ఓటరు కార్డు అవసరం లేకుండా ధ్రువపత్రాలను జారీ చేయిస్తామన్నారు.


ప్రారంభమైన రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు



జడ్చర్ల టౌన్: పట్టణంలోని రాఘవేంద్రస్వామి మఠంలో బుధవారం రాత్రి 352వ ఆరాధనోత్సవాలు వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించటంతోపాటు ధ్వజారోహణం, ధనలక్ష్మి పూజ, గోపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గొర్రెల పంపిణీ

కోయిల్‌కొండ: మండలంలోని కేశ్వాపూర్, ఖాజీపూర్, ఆచార్యపూర్ గ్రామాల్లో బుధవారం గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్ రెడ్డి పాల్గొని పంపిణీ ప్రారంభించారు. సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బచ్చిరెడ్డి, రైతు సమితి సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య, వైస్‌ఎంపీపీ కృష్ణయ్యయాదవ్, సర్పంచ్ మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.



లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలి



మిడ్జిల్: పత్తి విత్తనాలు వేసిన 45 రోజుల తర్వాత గులాబి రంగు పురుగు రావడం గమనించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్ బుధవారం తెలిపారు. వాటి నివారణ కోసం లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలని సూచించారు. బుధవారం దోనూర్‌లో పత్తి పంటలను పరిశీలించారు. అనంతరం రైతులకు పత్తి యాజమాన్య పద్ధతులు వివరించారు. మండల వ్యవసాయ అధికారి సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్ : విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్‌ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈమేరకు జేపీఎన్‌సీ ఇంజనీరింగ్ కళాశాలలో ‘రోడ్డు సేఫ్టీ పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, త్రిబుల్ రైడింగ్ చేయొద్దన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజీవన్, కోఆర్డినేటర్ రాజేశ్, సాయికృష్ణ, సబ్‌ఇన్‌స్పెక్టర్ షంసుద్దీన్, రమేష్, పాల్గొన్నారు.

గ్రామకంఠంలో కలపాలని వినతి

అడ్డాకుల: మండలంలోని కందూర్ చుట్టూ 20 ఏళ్ల క్రితం నివాస గృహాలను నిర్మించుకున్న స్థలాలను గ్రామకంఠంలో కలపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. సర్పంచ్ శ్రీకాంత్, ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌గౌడ్‌తో కలిసి గ్రామస్తులు బుధవారం అడ్డాకులలో తహసీల్దార్ ఘన్సీరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఏళ్ల నుంచి ఇక్కడే నివాసముంటున్నా అప్పట్లో స్థలాలను విక్రయించిన వారే ఇప్పటికీ పట్టాదారులుగా కొనసాగడం వల్ల తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. తాము కట్టుకున్న ఇళ్లకు నంబర్‌తో పాటు కరెంటు మీటర్, నల్లా కనెక్షన్ ఉన్నట్లు పేర్కొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కందూర్ గ్రామస్తులు

ఇళ్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తుల పరిశీలన



కల్లేపల్లిలో పరిశీలన చేస్తున్న అధికారులు

రాజాపూర్: గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం 59 జీఓను అమలులోకి తీసుకురావడంతో అట్టి దరఖాస్తులను జిల్లా మైనార్టీ వెల్‌ఫేర్ అధికారి రవీంద్రనాథ్ బుధవారం పరిశీలించారు. ఈ మేరకు మండల కేంద్రంతో పాటు, కల్లేపల్లిలో క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టారు. మండలంలో మూడు దరఖాస్తులు రావడంతో తహసీల్దార్ ఉన్నతాధికారులకు పంపించారని..ఈ నేపథ్యంలోనే బుధవారం పరిశీలన చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భరత్‌కుమార్ ఉన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సాగనంపుదాం

స్టేషన్ మహబూబ్‌నగర్: దగాకోరు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సాగనంపుదామని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్నాటకలో ఇచ్చిన హామీలను వంద రోజుల్లోనే నెరవేర్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. తెలంగాణలో డిక్లరేషన్లతో ప్రజల్లోకి వెళ్తున్నట్లు వివరించారు. వచ్చేనెల 6న షాద్‌నగర్‌లో బీసీ డిక్లరేషన్ సభ ఉంటుందని, త్వరలో మైనార్టీ, మహిళా డిక్లరేషన్లను కూడా ప్రకటిస్తామని వివరించారు. బీఆర్ఎస్ మోసాలను ప్రజలను గమనిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని, రానున్న ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రాల్లో అధికారంలోకి వస్తామని వివరించారు. నాయకులు సీజే బెనహర్, వసంత, లక్ష్మణ్‌యాదవ్, సిరాజ్‌ఖాద్రీ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు ఉన్నతంగా ఎదగాలి



ముఖ్య అతిథులకు స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు



కార్యక్రమం ప్రారంభిస్తున్న అధికారులు

మహమ్మదాబాద్: విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలని, ఉన్నతంగా ఎదగాలని రీజినల్ కోఆర్డినేటర్ క్లారెన్స్ రాణి తెలిపారు. వాయిస్‌ఫర్ గరల్స్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నంచర్ల గురుకులలో ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలోని 11 పాఠశాలల నుంచి మొత్తం 165 మంది విద్యార్థినులు పాల్గొన్నట్లు వివరించారు. ఈనెల 20న ప్రారంభమైన ఈ కార్యక్రమం 10 రోజుల పాటు కొనసాగిందన్నారు. ప్రిన్సిపాల్ వెంకటమ్మ మాట్లాడుతూ సమాజంలో స్త్రీ పురుషులు సమానంగా ఉండాలంటే అర్థం చేసుకునే భావన కల్గి ఉండాలని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డీసీఓ వాణిశ్రీ, వాయిస్‌ఫర్ గరల్స్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ అనూష, జడ్చర్ల ప్రిన్సిపాల్ శిరీష పాల్గొన్నారు.

దశలవారీగా పోరాటాల్లో పాల్గొనాలి

జడ్చర్ల టౌన్: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు దశలవారీగా పోరాటంలో పాల్గొనాలని నాయకులు అన్నారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రశాఖ పిలుపు మేరకు స్థానిక కార్యాలయం ఎదుట కార్మికులు కరపత్రాలను ఆవిష్కరించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, కేటగిరీల వారీగా వేతనాలు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇస్తున్నట్లుగా రూ.21వేల కనీస వేతనం ఇవ్వాలన్నారు. సెప్టెంబర్ 5 వరకు సమస్యలపై కరపత్రాల పంపిణీ, సెప్టెంబర్ 6 నుంచి 10 వరకు మున్సిపల్ చైర్మన్లు, చైర్‌పర్సన్‌లు, కమిషనర్లకు వినతిపత్రాల సమర్పణ, సెప్టెంబర్ 12న ఎమ్మెల్యేల ఇళ్లు, క్యాంప్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ప్రతి కార్మికుడు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 30న చలో హైదరాబాద్ జయప్రదం చేయాలని కోరారు. మున్సిపాలిటీ అధ్యక్షుడు కృష్ణ, కార్మిక నాయకులు దేవమ్మ, అంజమ్మ, అరుణ్‌కుమార్, సాగర్, యాదయ్య, నర్సమ్మ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కార్మికులు

నోటీసులకు భయపడేది లేదు



నిరసన తెలుపుతున్న రెండవ ఏఎన్‌ఎంలు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: రెండవ ఏఎన్‌ఎంల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా నోటీసులు జారీ చేయడమేమిటని, వైద్య ఆరోగ్య శాఖ జారీ చేస్తున్న అక్రమ నోటీసులకు భయపడేది లేదని ఏఐటీయూసీ నాయకులు రామ్మోహన్, పి.సురేశ్ హెచ్చరించారు. నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం రెండవ ఏఎన్‌ఎంలు కలెక్టరట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం ఏఎన్‌ఎంలు వైద్యారోగ్య శాఖ అధికారులకు రాఖీలు కట్టి నిరసన తెలిపారు. జయమ్మ, మంజుల, అన్నపూర్ణ, గిరిజ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.